సాక్షి నాగర్‌కర్నూల్

గురువారం ׀ 23 ׀ మార్చి ׀ 2023



రాష్ట్రపతి పాలన అవసరం

రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన తేవాలని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

వివరాలు 8లో ▸



కాల్వలను పట్టించుకోరా?

సరళాసాగర్ ఎడమ కాల్వ పరిస్థితి అధ్వానంగా మారింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
35.0 /22.3

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం నిర్మలంగా ఎండగా ఉంటుంది. రాత్రికి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

తీపి, చేదు, వగరుల కలయికే ఉగాది



కందనూలు: తీపి, చేదు, వగరుల కలయికనే ఉగాది పర్వదినమని.. ఆనందోత్సాహాలతో తెలుగు కొత్త సంవత్సరానికి స్వాగతం పలకాలని ప్రముఖ విద్యావేత్త సి.భాస్కర్ రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ కవిగాయకుడు కల్వకోల్ మద్దిలేటి అధ్యక్షతన ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలు ఇంటికొస్తున్న తరుణంలో ఉగాది పండుగ వస్తుందని, రైతులు కూలీలు ప్రజలు సంతోషంగా గడిపే రోజే ఉగాది అని అన్నారు. అనంతరం కవి కోట్ల గౌతమ్ తన కవితా గానంలో శోభకృత నామ సంవత్సరంలో ఎన్నికల నామసంవత్సరంగా మిగిలిపోతుందని, సహజ ఉష్ణోగ్రత కన్నా.. రాజకీయ ఉష్ణోగ్రత వేడెక్కిందని అన్నారు. ఎదిరెపల్లి కాశన్న సిట్ చేతిలో చిక్కుకున్న విద్యార్థుల జీవితాలపై, ఉద్యోగవకాశాలపై, కవితాగానం చేశారు. వనపట్ల సుబ్బయ్య.. మతసామరస్యత సామాజిక విలువలపై కవితా గానం చేశారు. ధర్మకారి రామేశ్వర్ రావు, అక్కల రాజేష్, కృష్ణయ్య, బాల్ రెడ్డి, తదితరులు సామాజిక అంశంగా ఉగాది కవితాగానం చేశారు. కవితలపై పి.వహీద్‌ఖాన్ సమీక్షించి సందేశమిచ్చారు. అనంతరం నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సాంప్రదాయ బద్ధంగా కవులకు ఉగాది భక్షాలు, పచ్చడి అందించడంతోపాటు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కందికొండ మోహన్, ముచ్చర్ల దినకర్,కవులు పాల్గొన్నారు.

విశేషాలంకరణలో రామలింగేశ్వరస్వామి



అడ్డాకుల: కందూర్ శివారులోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఉగాది సందర్భంగా బుధవారం ప్రధాన ఆలయంలోని శివలింగాన్ని అర్చకులు రకరకాల పూలు, పండ్లతో విశేషాలంకరణ నిర్వహించారు. అంతకు ముందు శివలింగానికి విశేష అభిషేకం చేశారు. ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు, జాతరను విజయవంతంగా నిర్వహిస్తున్న అర్చకులు, నిర్వాహకులకు పండగను పురస్కరించుకుని నూతన వస్త్రాలను అందజేశారు. ఇదిలా ఉండగా పండగ సందర్భంగా ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయానికి వచ్చిన భక్తులు కోనేరులో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం పరిసరాల్లోని కల్పవృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కాగా జాతరను శ్రీరామనవమి వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.శ్రీకాంత్, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, ఈఓ రాజేశ్వరశర్మ, ఆలయ ఉద్యోగి అనంతసేన్‌రావు, అర్చకులు తదితరులు ఉన్నారు.

మోక్షమెప్పుడో..?

ఆధునికీకరణకు నోచుకోని కేఎల్ఐ కాల్వలు



కేఎల్ఐ కాల్వలో పేరుకుపోయిన జమ్ముగడ్డి

- చాలా కాల్వల్లో పేరుకుపోయిన జమ్ముగడ్డి, ముళ్లపొదలు
- నీరు పారేందుకు అడ్డంకులు
- చివరి ఆయకట్టుకు నీరందక రైతుల అవస్థలు
- నిధులు వెచ్చించడంలో సాంకేతిక సమస్యలు

కొల్లాపూర్: జిల్లాలో మూడు లక్షల ఎకరాలకు పైగా సాగునీరందించే కేఎల్ఐ ప్రాజెక్టుపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ప్రాజెక్టు పరిధిలోని కాల్వలు ఏళ్లు గడుస్తున్నా ఆధునీకరణకు నోచుకోవడం లేదు. కాల్వల్లో జమ్ముగడ్డి, ముళ్లపొదలు పెరగడం, వాటిని స్థానిక ప్రజాప్రతినిధులు లేదంటే రైతులు తమ సొంత డబ్బులతో తొలగించుకోవడం పరిపాటిగా మారింది. జమ్ము, ముళ్ల చెట్లు పెరగడంతో సాగునీరు ముందుకు పారేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ వేసవిలోనైనా కాల్వల ఆధునీకరణ చేపట్టాలని రైతాంగం కోరుతున్నారు. ఇదిలాఉండగా, కేఎల్ఐ ప్రాజెక్టు కింద ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లి గట్టు రిజర్వాయర్లు ఉన్నాయి. ఎల్లూరు రిజర్వాయర్ కింద 70వేల ఎకరాల ఆయకట్టు, జొన్నలబొగుడ రిజర్వాయర్ కింద 90వేల ఎకరాలు, గుడిపల్లి గట్టు రిజర్వాయర్ కింద 1,80 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అయా భూములను సాగునీరు అందించేందుకోసం 324 కి.మీ మేరకు కాల్వలను తవ్వారు.

సీసీ పనులు చేపట్టలే..

ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్ల ద్వారా సాగునీటిని విడుదల చేసే డిస్ట్రిబ్యూటరీ చానళ్ల వద్ద కొంతమేరకు సీసీ లైనింగ్ ఏర్పాటుచేశారు. మిగతా ప్రాంతాల్లో ఎక్కడా సిమెంట్ లైనింగ్ లేదు. మూడేళ్ల క్రితం ఎల్లూరు రిజర్వాయర్ నుంచి సింగోటం రిజర్వాయర్ వరకు మెయిన్ కెనాల్‌కు సిమెంట్ లైనింగ్ చేసేందుకు ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు విడతల వారీగా చేస్తున్నారు. ఇప్పటివరకు పనులు పూర్తికాలేదు. ఈ కాల్వ మినహాయిస్తే ఎక్కడ కూడా సీసీ పనులు చేపట్టలేదు. దీంతో కాల్వల్లో జమ్ముగడ్డి, ముళ్ల చెట్లు పెరిగి సాగు నీరు ముందుకు పారడం లేదు.

ఈజీఎస్‌తో ఫలితమేదీ..?

జమ్ముగడ్డి, ముళ్లపొదల తొలగింపు కోసం రూ.లక్షలు ఖర్చు అవుతుండడంతో ఈ పనులను ఈజీఎస్ ద్వారా చేపట్టేందుకు అధికారులు రెండేళ్ల క్రితం అనుమతులు ఇచ్చారు. అయితే ఎక్కడ కూడా ఈజీఎస్ ద్వారా కాల్వల్లో జమ్ము, కంప చెట్ల తొలగింపు పనులు చేపట్టలేదు. జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. ఈజీఎస్ ద్వారా పనులు చేపట్టడం ప్రశ్నార్థకంగానే మారింది. కాల్వల్లో జమ్ము, కంపచెట్ల కారణంగా నీళ్లు ముందుకు పారడం లేదు. దీంతో కొన్ని ప్రాంతాల్లో నీటి నిల్వ అధికమై కాల్వలు తెగిపోయిన దాఖలాలు కోకొల్లలుగా ఉన్నాయి. కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఎత్తం, వరిదేల, చౌటబెట్ల శివార్లలో, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తుమ్మల సూగూరు. బల్లాన్‌పల్లి, వట్టెం, చర్ల ఇటిక్యాల, మారేపల్లి శివార్లలో, కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని బండోనిపల్లి, కుర్మిద్ద శివార్లలో గతంలో కేఎల్ఐ కాల్వలకు గండ్లు పడి పంటలు దెబ్బతిన్నాయి. తెగిపోయిన కాల్వలను కూడా ఆధునీకరించని దుస్థితి నెలకొంది.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లా



కేఎల్ఐ పరిధిలోని కాల్వలు అన్నింటికీ సిమెంట్ లైనింగ్ చేసేందుకు, పసుపుల బ్రాంచ్ కెనాల్ డిజైన్‌లో లోపాలు సవరించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరా. ఆయన సానుకూలంగా ఉన్నారు. గతంలో ఈపీసీ ప్రాతిపదికన కాల్వలు నిర్మించారు. ఈ ప్రక్రియ పూర్తి అయినట్లు అధికారులు నివేదికలు ఇస్తేనే ప్రభుత్వం మెయింటనెన్స్ నిధులు మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇందులో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కూడా ఉంది. వీటన్నింటిపై సమీక్ష నిర్వహిస్తాం. రైతుల విజ్ఞప్తి మేరకు కొన్ని ప్రాంతాల్లో సొంత డబ్బులతోనే జమ్ముగడ్డి, కంపచెట్లు తొలగించే పనులు చేయించాను.

– బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే, కొల్లాపూర్

నిధులు వెచ్చించడంలో అలసత్వం

కేఎల్ఐ కాల్వల ఆధునీకరణకు నిధులు వెచ్చించడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోంది. ప్రతి ఏటా బడ్జెట్‌లో ప్రాజెక్టు నిర్వహణకు అరకొర నిధులను మాత్రమే వెచ్చిస్తోంది. నిధుల లేమి కారణంగా అధికారులు కూడా కాల్వల ఆధునీకరణ మీద దృష్టి పెట్టడం లేదు. చేసేదిలేక రైతుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి తన సొంత డబ్బులతో పాన్‌గల్, కోడేరు మండలాల్లో పలు చోట్ల కాల్వ మరమ్మతు, రామాపురం, బోయల పల్లె గ్రామాల మధ్య, ఎల్లూరు, కొల్లాపూర్, వరిదేల ప్రాంతంలోని కాల్వను శుభ్రం చేయించారు. అయితే, ఈ సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని, కాల్వల ఆధునీకరణకు నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

కేఎల్ఐ ప్రాజెక్టు వివరాలిలా..

రిజర్వాయర్లు	కాల్వల పొడవు (కి.మీ.లలో)	నిర్ణీత ఆయకట్టు (ఎకరాల్లో)
ఎల్లూరు, సింగోటం	84	70,000
జొన్నలబొగుడ	160	90,000
గుడిపల్లి గట్టు	80	1,80,000



కేఎల్ఐ కాల్వలో ముళ్లపొదలు

బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం లేదు

వనపర్తి: తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం లేదని.. ప్రజల ఆశీస్సులు తమకు పుష్కలంగా ఉన్నాయని, వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చేది తామ పార్టీయేనని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం జిల్లాకేంద్రంలోని తాళ్లచెరువు, లక్ష్మీకుంట చెరువులను ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, భవిష్యత్‌పై దృష్టి సారించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు వెయ్యికిపైగా గురుకుల పాఠశాలలను ప్రారంభించామన్నారు. విద్య, వైద్యం, ఉపాధిరంగాల్లో ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ ముందుందని వివరించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు..

వనపర్తి మండలం అప్పాయిపల్లికి చెందిన ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు సుమారు 40 మంది బుధవారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయన్నారు.

ఆనందోత్సాహాలతో ఉగాది

- శోభకృత నామ సంవత్సరానికి ఘనంగా ఆహ్వానం
- ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు
- పంచాంగ శ్రవణంలో వేదపండితులు బిజీబిజీ

అచ్చంపేట/కందనూలు: తెలుగు కొత్త సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని బుధవారం జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. శుభకృత్ నామ సంవత్సర తీపి, చేదు అనుభవాలను మరిచి జిల్లాలో శోభకృత నామ సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. తెల్లవారుజామునే లేచి ఇళ్లలో దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, రానున్న సంవత్సరం అంతా శుభం జరగాలని కోరుకున్నారు. ఉగాదికి ప్రతీకగా నిలిచే షడ్రుచుల సమ్మేళనం పచ్చడి, బక్షాలు సేవించారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో పండుగను వైభవంగా జరుపుకొన్నారు. ఈ పండుగ అంటేనే పంచాంగ శ్రవణాలకు పెట్టింది పేరు. జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయం, రామ్‌నగర్, సుబ్రమణేశ్వరస్వామి, హౌసింగ్ బోర్డు వేంకటేశ్వర ఆలయాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో స్థానిక పండితులు పంచాంగ శ్రవణాలు చదువుతూ జిల్లా భవిష్యత్తును వివరించడంతో పాటు, ప్రజలు తమతమ రాశి ఫలాలు, జాతక చక్రాలు, గ్రహస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకున్నారు. అలాగే, ఆలయాల్లో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

సిరిసంపదలు కలగాలని..

రైతులు కొత్త సంవత్సరం రోజున వారి వారి వ్యవసాయ పొలాల్లో నాగలిని తొలి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. గోవులను అలంకరించి పూజలు చేసి పొలాల్లో ఐదుసార్లు నాగలిసాళ్లు పట్టించారు. ఇలా చేయడం వల్ల పాడి పంటలు బాగా పండుతాయని రైతుల విశ్వాసం. చిరుధాన్యాలను పొలాల్లో చల్లి దేవుడికి కొబ్బరి కాయ కొట్టి, నైవేద్యం పెట్టారు. అనంతరం నాగలిసాళ్లు పట్టించారు. సిరిసంపదలతో ఇంటిల్లిపాది ఆనందోత్సాహాల మధ్య గడపాలని ప్రార్థించారు. కులవృత్తుల వారు వస్తువులకు, పరికరాలకు పూజలు చేశారు.



జిల్లా కేంద్రంలో పంచాంగ శ్రవణంలో వేదపండితుడు దుర్గి శ్రీకాంత్ శర్మ

సమృద్ధిగా వర్షాలు.. వేగంగా అభివృద్ధి

శోభకృత నామ సంవత్సరంలో జిల్లా అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతుందని అర్చక సంఘం గౌరవ జిల్లా అధ్యక్షుడు దుర్గి శ్రీకాంత్ శర్మ, సుబ్రమణ్యేశ్వర ఆలయ ప్రధాన అర్చకుడు నర్వ వేంకటేశ్వర శర్మ వివరించారు. ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సుబ్రమణ్యేశ్వర ఆలయం, నాగనూలు అయ్యప్ప స్వామి ఆలయంలో వేదపండితులు పంచాంగ పఠనం చేశారు. ఈ ఏడాదిలో జిల్లా భవిష్యత్తు ఎలా ఉండబోతుందో వివరించారు. వర్షాలు అధికంగా పడతాయని, సాగు నీళ్లు సమృద్ధిగా ఉంటాయని, రైతులు సరైన సస్యరక్షణ చర్యలతో పంటలు సాగు చేస్తే ప్రయోజనం ఉంటుందని, అలాగే పంటలపై తెగుళ్ల ప్రభావం ఉంటుందన్నారు. శాంతిభద్రత చర్యలు పటిష్టంగా చేపడతారని, జల ప్రమాదాలు ఎక్కువగా జరిగే ఆస్కారం ఉంటుందని, రాజకీయాల్లో నాయకుల వాగ్దానాలు ఎక్కువగా ఉండడంతోపాటు ప్రత్యారోపణలు అధికమవుతాయని, జిల్లా రాజకీయాల్లో మార్పులు వచ్చే అవకాశం ఉంటుందని అర్చకులు వివరించారు.



జిల్లా కేంద్రంలోని సుబ్రమణ్యేశ్వర ఆలయంలో పచ్చడి పంపిణీ



ఉగాదిని పురస్కరించుకుని పాలిశెట్టిపల్లిలో నిర్వహించిన బండలాగుడు పోటీలు

నల్లమల క్షేత్రాలు కిటకిట

శ్రీశైలం ఉత్తర ద్వారమైన శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, అర్చనలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. శ్రీశైలం వెళ్లి వచ్చే భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో ఉగాది పర్వదిన ప్రత్యేక వేడుకలు నిర్వహించారు.

● 'శ్రీనివాసుడి' మాయ

క్లీన్ 'చీట్'..!

'సీఎమ్మార్'లో భారీ గోల్‌మాల్



- సుమారు 30వేల ధాన్యం బస్తాలు పక్కదారి, రూ.5కోట్లు హాంఫట్
- అయిజకు చెందిన ఓ మిల్లర్ బాగోతం
- అధికారుల అండతో సర్కారుకు బురిడీ
- గత సీజన్‌వి భర్తీ చేయకున్నా క్లియరెన్స్ సర్టిఫికెట్
- యథేచ్ఛగా మళ్లీ కేటాయింపులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: దందాలకు కేరాఫ్‌గా మారిన నడిగడ్డలో అక్రమార్కుల హవానే కొనసాగుతోంది. కస్టం మిల్లింగ్ రైస్‌నే ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్న మిల్లర్ల మాఫియా అధికారుల అండతో రెచ్చిపోతోంది. పెట్టుబడి లేకుండా సర్కారు సొమ్ముతో యథేచ్ఛగా వ్యాపారం చేస్తూ.. కోట్లాదిగా డబ్బులు కూడగట్టుకుంటోంది. పేదలకు అందాల్సిన నాణ్యమైన బువ్వను వారి నోటి కందనీయకుండా మాయ చేస్తోంది. ఇంత జరుగుతున్నా.. పట్టించుకునే వారే లేకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ కేంద్రంగా దేవుడి పేరుతో ఉన్న ఓ రైస్ మిల్లులో సీఎమ్మార్ రైస్‌లో భారీగా గోల్‌మాల్ చోటుచేసుకోవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. మిల్లర్ ధన దాహం.. సివిల్ సప్లయ్ శాఖలోని పలువురి అధికారుల కక్కుర్తి వెరసి పెద్దమొత్తంలో సీఎమ్మార్ ధాన్యం బస్తాలు పక్కదారి పట్టాయి. ఈ అవినీతి బాగోతంలో తవ్వేన కొద్దీ కొత్త కోణాలు వెలుగుచూస్తున్నాయి.

రూ.5కోట్ల విలువైన బస్తాలు మాయం..

2021–22 రబీకి సంబంధించి సదరు మిల్లుకు అధికారులు 2,165.68 మెట్రిక్ టన్నుల సీఎమ్మార్ ధాన్యం కేటాయించారు. లెక్కప్రకారం దీన్ని మర ఆడించి 1472.66 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సదరు మిల్లర్ తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలి. కానీ ఇందులో రూ.5కోట్ల మేర విలువ జేసే సుమారు 30వేల బస్తాల ధాన్యాన్ని ఆ మిల్లర్ బహిరంగ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నాడు. జిల్లా సివిల్ సప్లయ్‌శాఖలో పలువురు అధికారులు, సిబ్బందికి అంతా తెలిసే ఈ తతంగం జరిగినట్లు సమాచారం.

భారీగా పెండింగ్.. అయినా క్లియరెన్స్ సర్టిఫికెట్

కేటాయింపుల మేరకు మిల్లర్లు పూర్తిస్థాయిలో సీఎమ్మార్ బియ్యాన్ని నిర్దిష్ట గడువులోగా ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంటుంది. లేకుంటే నిబంధనల ప్రకారం అధికారులు చర్యలు తీసుకోవచ్చు. గడువు ముగిసే సమయానికి కేటాయించిన వాటిలో కొంతమేర మాత్రమే పెండింగ్ ఉన్నట్లయితే సదరు మిల్లులకు జరిమానా (కేటాయించిన దానికంటే అదనంగా 20 నుంచి 30 శాతం) విధిస్తూ.. క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వడం.. మళ్లీ యథావిధిగా వచ్చే సీజన్‌లో కేటాయింపులు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఒకవేళ పెద్దమొత్తంలో పెండింగ్ ఉన్నట్లయితే సదరు మిల్లు లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి. ఆ మిల్లులకు మళ్లీ కేటాయింపులు చేయొద్దు. కానీ గద్వాల జిల్లా సివిల్ సప్లయ్‌శాఖ అధికారులు ఈ నిబంధనను తుంగలో తొక్కారు. అయిజలో దేవుడి పేరు గల మిల్లుకు సంబంధించి భారీగా పెండింగ్ ఉన్నప్పటికీ.. గుట్టుచప్పుడు కాకుండా ఈ ఏడాది జనవరిలో క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇచ్చారు. అంతేకాదు.. సదరు మిల్లుకు మళ్లీ 15వేల మెట్రిక్ టన్నుల సీఎమ్మార్ ధాన్యాన్ని కేటాయించడం గమనార్హం.

వెలుగులోకి ఇలా ..

గద్వాల జిల్లాకేంద్రంలోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ కార్యాలయంలో ఇటీవల మిల్లర్లు సమావేశమయ్యారు. ఇందులో అయిజ పరిధిలో దేవుడి పేరిట ఉన్న రైస్ మిల్లు యజమాని.. తోటి మిల్లర్ల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. 30 వేల బస్తాలకు పైగా పక్కదారి పట్టించిన తీరు, సీఎమ్మార్ బియ్యం ప్రభుత్వానికి అందజేయకుండానే క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవడంపై సదరు మిల్లు యజమానిని మిల్లర్లు ప్రశ్నించారు. దీనికి ఆయన ఘాటుగా సమాధానం చెప్పడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. 'నా అవినీతి గురించి మీకెందుకు.. నేను ధాన్యం పెట్టానా.. లేదా.. అనేది మీకు అనవసరం.. నేను అధికారులను మేనేజ్ చేసుకుని క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకున్నా.. మీరు ఇప్పుడు నిజాయితీపరులుగా మారినంత మాత్రాన గతంలో మీరు చేసిన అవినీతి పనులు ఎవరికి తెలవవు.. ముమ్మాటికీ పెత్తనం చెలాయిస్తా.. నా వద్ద మీ పప్పులు ఉడకవు.. నేను కూడా మీ అవినీతిని బయటకు తీస్తా.. మీరు శ్రీరంగ నీతులు చెబితే వినడానికి నేనేమీ తిక్కలోడిని కాదు' అని ఆ మిల్లు యజమాని ఆగ్రహంతో చిందులేశాడు. దీంతో మిల్లర్లు లేచి 'మిల్లర్ల సంఘం నాయకుడిగా ఉండి.. తప్పు చేసింది కాక మమ్మల్నే దబాయిస్తావా.. నీకెంత ధైర్యం' అంటూ వాదనకు దిగారు. ఈ క్రమంలో ఒకరికొకరు తన్నుకోవడంతో విషయం వెలుగులోకి రాగా.. హాట్‌టాపిక్‌గా మారింది.



ఇటీవల సమావేశమైన మిల్లర్లు

ఉన్నతాధికారిని సైతం బురిడీ కొట్టించి..

మామూళ్లకు అలవాటు పడిన సివిల్ సప్లయ్ శాఖలోని ఓ అధికారితో పాటు పలువురు సిబ్బంది సదరు మిల్లు యజమానికి ఎప్పటి నుంచో అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఈసారి భారీగా ముడుపులు అందుకోవడంతో ఆ అధికారి అన్నీ తానై దగ్గరుండి వ్యవహారాలు నడిపినట్లు తెలుస్తోంది. గత సీజన్‌లోనివే భారీగా పెండింగ్ ఉన్నప్పటికీ రికార్డుల్లో జీరో లేదా అతి తక్కువ మొత్తంలో చూపించి.. సదరు మిల్లు యజమానికి మేలు చేసేలా అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇందులో పరిపాలనా పరమైన అనుమతులు ఇవ్వాల్సిన ఓ కీలక అధికారిని సైతం బురిడీ కొట్టించి.. సదరు మిల్లర్‌కు వచ్చే సీజన్‌కు సంబంధించి కేటాయింపులు చేసినట్లు సమాచారం. ఈ బాగోతంలో పెద్ద ఎత్తున చేతులు మారగా.. పలువురు అధికారులు, సిబ్బంది వాటాల చొప్పున పంచుకున్నట్లు తెలిసింది.

ఐదారు నెలల క్రితం జరిగింది..

సీఎమ్మార్ రైస్‌కు సంబంధించి మేము ఎవ్వరికీ క్లీన్ చీట్ ఇవ్వలేదు. కేటాయించిన వాటిలో మూడు లేదా నాలుగు ఏసీకేలు మాత్రమే పెట్టాల్సి ఉన్న మిల్లర్లకు వచ్చే సీజన్‌కు సంబంధించి సీఎమ్మార్ ధాన్యం కేటాయించాం. ప్రతి మిల్లర్ నుంచి వంద శాతం సీఎమ్మార్ బియ్యం ప్రభుత్వానికి అందేలా చూస్తాం. ఎవరినీ వదిలేది లేదు. ఈ వ్యవహారం ఐదారు నెలల క్రితం జరిగింది. ఇటీవల మిల్లర్లు కొట్టుకున్న విషయం నా దృష్టికి రాలేదు.

– ప్రసాద్‌రావు, సివిల్ సప్లయ్ డీఎం

ఘనంగా బీరప్ప బండారోత్సవం



నారాయణపేట టౌన్: మండలంలోని సింగారం గ్రామంలో ఐదు రోజులుగా కొనసాగుతున్న బీరప్ప బండారు ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఐదేళ్లకు ఒక్కసారి నిర్వహించే ఈ ఉత్సవాలలో చివరిరోజు యానగుంది బీరప్ప ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం నుంచి పెద్ద బోనంకుండతో గ్రామంలో ఊరేగింపుతో ఎల్లమ్మ ఆలయం చేరుకున్నారు.గ్రామస్తులు తమ బంధువులకు కొత్త బట్టలతో ఒడి బియ్యం పోసి బండారు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

క్లుప్తంగా

ఆర్థిక సమస్యలతో వ్యక్తి బలవన్మరణం


నర్సింహులు (ఫైల్)

గద్వాల క్రైం: ఆర్థిక, కుటుంబ సమస్యలు తాళలేక వ్యక్తి రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని బీసీకాలనీకి చెందిన తెలుగు నర్సింహులు (48) హమాలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నెల క్రితం తన కూతురు వివాహానికి అప్పు చేశాడు. అప్పు పెరిగిపోవడం, కుటుంబ సభ్యులతో తరుచూ వివాదాలు వస్తుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో బుధవారం ఉదయం గద్వాల–రాయచూర్ రైల్వే పట్టాలపై గుర్తు తెలియని రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు సంఘటన స్థలం వద్దకు రైల్వే పోలీసులు చేరుకుని పరిశీలించారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: మతిస్థిమితం లేని వ్యక్తి పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుంటే రైలు ఢీకొట్టడంతో బుధవారం అక్కడికక్కడే మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ అక్బర్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన సవారి సాయిలు(60)గా గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

● ముగ్గురికి తీవ్ర గాయాలు

మక్తల్: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని ఉప్పర్‌పల్లి స్టేజి వద్ద బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామంలో ఓ ఇంట్లో దశదినకర్మ కార్యక్రమం ముగించుకుని మంతన్‌గోడ్ చెందిన శివరాజ్, చిన్న మారెమ్మ, పెద్ద మారెమ్మలు స్వగ్రామానికి బయలుదేరారు. ఇదే క్రమంలో మండలంలోని లింగంపల్లికి చెందిన మూకిశివలింగప్ప(36) మక్తల్ నుంచి సొంత గ్రామానికి వెళ్తూ ఎదురెదురుగా అతివేగంగా రెండు బైకులు ఢీకొన్నాయి. ఇందులో శివరాజు, చిన్న మారెమ్మ, పెద్ద మారెమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మూకి శివలింగప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పర్వతాలు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతి

గద్వాల క్రైం: గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని బుధవారం సాయంత్రం గుర్తించినట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్‌షుకూర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని మహిళ (50) పడి ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి సంబంధించిన కుటుంబ సభ్యులు పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు..

మిడ్జిల్: మండలంలోని మసిగొండ్లపల్లి చెందిన శ్రీధర్(19) ఈనెల 19వ తేదీన బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వేధింపులు భరించలేక నర్సు ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: ఓ యువకుడి వేధింపులతో ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సు గుర్తు తెలియని ఇంజక్షన్ ఎక్కించుకుని ఆత్మహత్య చేసుకుంది. టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పాత పాలమూరుకు చెందిన బోయ శోభ (24)కు ఆరేళ్ల కిందట పెళ్లి కాగా ఏడాదిన్నరగా జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తుంది. ఈ క్రమంలో రెండేళ్ల కిందట మన్యంకొండకు చెందిన కురుమూర్తితో పరిచయం ఏర్పడింది. దీంతో నర్సు కుటుంబ సభ్యులకు విషయం తెలియడంతో ఇద్దరిని మందలించారు. ఆమె ఫోన్ నంబర్‌ను కూడా మార్చారు. కాగా ఇటీవల హోలీ పండుగ నుంచి ఆ యువకుడు ఆమె ఫోన్ నంబర్ తెలుసుకుని ఫోన్ చేయడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం నుంచి కురుమూర్తి ఆమెకు పలు మార్లు ఫోన్ చేసి ఇబ్బందులకు గురి చేశాడు. ఈ విషయం శోభ ఆమె అన్నకు ఫోన్ చేసి సమాచారమిచ్చింది. అనంతరం ఆస్పత్రిలోని ఐసీయూలో గుర్తు తెలియని డ్రగ్ ఇంజక్షన్ తీసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి అన్న సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాష్ట్రపతి పాలన అవసరం


మన్ననూరులో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన తేవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదరికంతో చితికిపోయిన నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు వస్తాయని రూ.లక్షలు ఖర్చు చేసి, 18 గంటల పాటు చదువుకుంటున్నారని, అలాంటి వారి ఆశలపై పేపర్ లీకేజీ చేయించి నీళ్లు చల్లారని అన్నారు. పేపర్ లీకేజీ 100 మర్డర్ల కన్నా తీవ్రమైందిగా పరిగణిస్తున్నామని అన్నారు. రెండేళ్ల కాల్‌డేటాను పరిశీలిస్తే పేపర్ లీకేజీలో అసలు దోషులెవరో తేలుతుందన్నారు. సమాజం సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలని గ్రామాలలోకి వచ్చే ఎమ్మెల్యేలు, మంత్రులను నిలదీయాలన్నారు. తక్షణం రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన విధించాలన్నారు. కవిత లిక్కర్ కేసులో తెలంగాణ అడిషనల్ అడ్వకేట్ జనరల్ ఢిల్లీకి వెళ్లడమేమిటని ప్రశ్నించారు.

నిఖిత మృతి దురదృష్టకరం

మన్ననూర్: గురుకుల పాఠశాలలో విద్యార్థిని నాగిళ్ల నిఖిత మృతి బాధాకరమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మన్ననూర్‌లోని బాలికల గురుకుల పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. 6వ తేదీన పాఠశాలలో అనుమానాస్పదంగా మృతికి గల కారణాలను పరిశీలించడంతో పాటు పలువురిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నిఖిత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి బాధలు కష్టాలు ఉన్నా తోటి వారితో పంచుకోవాలని సూచించారు. గురుకులంలో చదువుకున్న కావ్య, మరో ఆరుగురు విద్యార్థినులు పైలెట్ అయ్యారని తెలిపారు. అలాంటి మీ అక్కలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నతమైన చదువుల్లో రాణించాలన్నారు. ఉన్నత స్థానంలో ఉన్న కొందరు మాజీ గురుకులం విద్యార్థుల ఫొటోలను విద్యార్థులకు చూపించారు. గురుకులాలతో తనకు 9ఏళ్ల అనుబంధం ఉన్నప్పటికీ ఇలాంటి దుస్థితి ఎన్నడూ చూడలేదన్నారు. నెలకు రూ. 2.63 లక్షల జీతం తీసుకునే నేను మనలాంటి వారందరి బతుకులు బాగు చేయాలనే ఉద్దేశంతో ఆరున్నర ఏళ్ల సర్వీసు ఉన్నప్పటికి ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. నిఖిత ప్రస్తుతం మనలో లేనప్పటికీ మనందరిలోనే ఉందనుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి రూ: 50 వేలు ఇచ్చేసి చేతులు దులుపుకోవాలనుకున్న పాలకులకు, అందుకు సహకరిస్తున్న పోలీసుల విధానం సరైందికాదన్నారు. చదువు కోసం పాఠశాలకు వచ్చి హత్యకు గురైతే, అలాంటా వారి ప్రాణం విలువ ఈ స్థాయిలో వెలకట్టడం ఎంత వరకు సమంజసమో దళితుడైన స్థానిక ఎమ్మెల్యే జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేంత వరకు అండగా ఉంటామని అన్నారు. శ్రీని వాసులు, భరత్‌కుమార్, యోసోబ్, వెంకటస్వామి, కాశన్నయాదవ్, నాసరయ్య, బాలకిష్టయ్య, కృష్ణ, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇదే చివరి పండుగ


చిన్నోనిపల్లెలో చెట్ల కింద కూర్చుని చర్చించుకుంటున్న గ్రామస్తులు

● రిజర్వాయర్ పనులకు పండుగ విరామం
● పండుగ పూట చిన్న బుచ్చుకున్న చిన్నోనిపల్లె నిర్వాసితులు


చిన్నోనిపల్లె రిజర్వాయర్ వద్ద నిలిచిన యంత్రాలు

గట్టు: కాడెద్దులకు ఉగాది పండుగ నాడు పచ్చని మామిడి ఆకుల తోరణాలు, పిండి వంటల నైవేద్యాన్ని సమర్పించుకుని, వచ్చే ముంగారి పంటలకు ఎలాంటి ఢోకా లేకుండా ముందుకు సాగేలా దీవించమని భగవంతున్ని ప్రార్థించే అన్నదాతల చేతులు ఆ ఊర్లో మాత్రం ముడుచుకున్నాయి. ఇప్పటి దాకా పట్టాలేకున్నా సొంత భూముల్లో రెక్కలు ముక్కలు చేసుకుని పంటలు పండించుకుంటున్న చిన్నోపల్లె నిర్వాసితులకు ఇక నుంచి ఆ అవకాశం ఉండకపోవచ్చు. మూట, ముల్లె సర్దుకుని వెళ్లే పోయే పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధులు తీసుకు వచ్చారని నిర్వాసిత కుటుంబాలు మండిపడుతున్నారు. రిజర్వాయర్ కట్ట గ్యాప్‌ను పూడ్చితే వాగు నీళ్ల ముందుకు వెళ్లే దారి లేక రిజర్వాయర్‌లోనే నిల్వ ఉండి గ్రామంలోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో రిజర్వాయర్ కట్ట గ్యాప్‌ను పూడ్చివేత పనులు పూర్తయితే ఊరు విడవక తప్పదని నిర్వాసిత కుటుంబాలు ఆందోళన చెందుతున్నారు. పక్క ఊర్లు, మండలం, జిల్లా వ్యాప్తంగా బుధవారం సంతోషాల మధ్య నూతన సంవత్సరాది ఉగాది చేసుకుంటే, నిర్వాసిత రైతు కుటుంబాల మాత్రం పండుగను పరేషాన్‌తో కానిచ్చేశారు. నిర్వాసిత కుటుంబాల్లో భవిష్యత్ అంధాకరంగా కనిపిస్తున్నట్లు వాపోతున్నారు.

పనులకు విరామం..

రిజర్వాయర్ దగ్గర చేపట్టిన పనులకు పండుగ సందర్భంగా బుధవారం విరామం ప్రకటించారు. యంత్రాలను ఎక్కడిక్కడే నిలిపి వేసి వెళ్లిపోయారు. కొంతమంది పోలీస్ బలగాలు మాత్రం అక్కడే ఉండిపోయారు. పోలీసుల అదుపులో ఉన్న నిరసన దీక్షను చేస్తున్న మిగిలిన వారిని మంగళవారం రాత్రి వదిలి వేయడంతో వారు ఇళ్లకు చేరుకున్నారు. చిన్నోనిపల్లె, ఇందువాసి నిర్వాసిత కుటుంబాల్లో పండుగ ఆనందం లేకుండా పోయింది. నిర్వాసిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

బీజేపీ జెండా ఎగరవేయడమే లక్ష్యం


జితేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన సర్వేశ్వర్‌రెడ్డి తదితరులు

● మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి

వనపర్తి క్రైం: రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరవేయడమే తమ లక్ష్యమని మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో రిటైర్డు ఏఎస్పీ సర్వేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రుక్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, సురేందర్, మహేష్, ఆంజనేయులు, రవి, 20మంది పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ప్రపంచంలోనే ఐదవ స్థానంలో చేరుకుందని తెలిపారు. రాష్ట్రంలో కేవలం కుటుంబపాలన నడుస్తుందని, ఏ స్కాం చూసినా వీరి పాత్ర ఉందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో గోల్కొండ మీద కాషాయ జెండా ఎగరాలంటే సర్వేశ్వర్‌రెడ్డి లాంటి చాలామంది నాయకులు కంకణ బద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, ప్రతాప్, కృష్ణయ్య, రవీందర్, నారాయణ ఉన్నారు.

యువతి అదృశ్యం

మహమ్మదాబాద్: తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే మండలంలోని వెన్నాచేడ్ చెందిన యువతి బుధవారం తెల్లవారుజామున ఇంటి నుంచి కుటుంబీకులకు చెప్పకుండా వెళ్లిపోయింది. గ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో తండ్రి పెద్దపురం చిన్నయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదయ్య తెలిపారు.

గడ్డివాము దగ్ధం

అయిజ: మండలంలోని కిష్టాపురంలో గొల్ల ఎర్రప్ప పొలంలో బుధవారం ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు.

రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశచూపి..

మహబూబ్‌నగర్ క్రైం: ఆన్‌లైన్‌లో ఓ వెబ్‌సైట్‌లో పెట్టుబడి పెట్టి.. ఆ తర్వాత విత్ డ్రా చేయవచ్చునని చెప్పి ఓ యువకుడిని మోసం చేశారు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని మర్లుకు చెందిన మెట్టుకాడి రవితేజకు ఇటీవల ఈ–కామర్స్ వెబ్‌సైట్ నుంచి వచ్చిన లింక్‌ను తెరిచాడు. అందులో దాంట్లో మొదట కొంత డబ్బు పెట్టుబడి పెట్టాలని చెప్పగా రూ.140 పెట్టగా, తిరిగి అతని ఖాతాలో రూ.300జమ చేశారు. ఇలా ఎక్కువ మొత్తంలో పెట్టుబడి చేయాలని చెప్పడంతో మొత్తం రూ.98,600చేయగా ఆ తర్వాత డబ్బులు విత్‌డ్రా చేయడానికి ప్రయతిన్నస్తే రాలేదు. ఇంకా ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే ఆ డబ్బులు వస్తాయని చెప్పాడంతో మోసపోయినట్లు గ్రహించి ఫిర్యాదు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాగి చెంబుతో రూ.కోట్లు వస్తాయని నమ్మించి..

● రూ.36లక్షలు, కారుతో పరారీ

మిడ్జిల్: రాగి చెంబుతో రూ.కోట్లు సంపాదించవచ్చని నమ్మించి మోసం చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మల్లాపూర్ చెందిన ముక్తాల వివేకానందగౌడ్, రంగారెడ్డి జిల్లాకు చెందిన నరేష్, మిథునం శేఖర్‌రెడ్డి, వెలిజర్ల మహేష్ కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. ఇబ్రహీంపట్నం యాచారం చెందిన జంగయ్య, మహేష్‌కు ఆరేళ్ల నుంచి పరిచయం ఉంది. జంగయ్యకు హైదరాబాద్‌లోని జీఎంఆర్ సంస్థలో పనిచేస్తున్న కర్నూల్ జిల్లా ఆత్మకూర్‌కు చెందిన రంగస్వామితో పరిచయం ఏర్పడింది. ఇందులో భాగంగానే మహేష్, రంగస్వామి తాను ఉన్నత స్థానంలో ఉన్నానని రాగిచెంబును రేడియేషన్ ద్వారా కెమికల్ చేసి, డీఆర్‌డీఎల్, ఇతర శాటిలైట్ కంపెనీలలో విక్రయిస్తే రూ.కోట్లలో డబ్బులు వస్తాయని చెప్పాడు. తన వద్ద రూ.2వేల కోట్ల కరెన్సీ ఉందని వీడియో కాల్ చేసి చూపించాడు. ఇబ్రహీంపట్నంకు చెందిన జంగయ్య, వెలిజర్లకు చెందిన మహేష్ నుంచి 8నెలల క్రితం రూ.20లక్షలు తీసుకుని డబ్బులు రెట్టింపు అవుతాయని తెలిపాడు. ఆ తర్వాత మల్లాపూర్‌కు చెందిన వివేకానందగౌడ్ నుంచి విడతల వారీగా రూ.16 లక్షలు తీసుకున్నాడు. డబ్బులు గోదాం నుంచి మార్చడానికి కారు అవసరమని తీసుకుని వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో వివేకానందగౌడ్ మంగళవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన బొలెరో వాహనం

● ముగ్గురికి తీవ్ర గాయాలు


ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జడ్చర్ల: మండలంలోని మాచారం వద్ద 44వ నంబర్ జాతీయరహదారిపై బుధవారం బైక్‌ను బొలెరో వాహనం ఢీకొనగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని గొల్లపల్లికి చెందిన నరేష్, స్వరూప, జగదీష్ బైక్‌పై జడ్చర్ల నుంచి గొల్లపల్లి వైపు వెళ్తున్నారు. మాచారం వద్ద సర్వీస్ రోడ్డు నుంచి జాతీయరహదారిపైకి ఒక్కసారిగా దూసుకువచ్చిన బొలెరో బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న వారు రోడ్డుపై కిందడి గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు హుటాహుటిన క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డుదాటుతుండగా ఢీకొన్న కారు

జడ్చర్ల: పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో జడ్చర్ల–మహబూబ్‌నగర్ ప్రధానరహదారిపై రోడ్డు దాటుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని కారు అతి వేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

తండ్రీ, కొడుకులకు తీవ్ర గాయాలు

మహమ్మదాబాద్: అతివేగంగా వస్తున్న కారు బైకును ఢీకొనడంతో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. కోయిలకొండ మండలం సూరారం చెందిన మంగలి శ్రీనివాస్, కుమారుడు భానుప్రకాష్ బుధవారం ఉదయం మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని బంధువుల ఇంటి వద్ద వేడుకకు వచ్చారు. మధ్యాహ్నం భోజనం చేసి తిరిగి స్వగ్రామానికి బైకుపై బయలుదేరారు. గ్రామం దాటి బ్రాహ్మణ చెరువు కల్వర్టు వద్దకు వెళ్తుండగా, వనపర్తికి చెందిన కారు కోస్గి వైపు నుంచి ఎదురుగా అతివేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. బైకు కల్వర్టుపై నుంచి ఎగిరి కాల్వలో పడిపోయింది. వారిద్దరికి కాళ్లు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అంబులెన్సులో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న అశోక్‌కుమార్ కుటుంబీకులకు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదంలో కారు కల్వర్టుకు ఢీకొని ఇరుక్కుపోవడంతో జేసీబీ సాయంతో పోలీసులు బయటకు తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదయ్య తెలిపారు.


కల్వర్టులో ఇరుక్కుపోయిన కారు

రేషన్‌బియ్యం పట్టివేత

జడ్చర్ల: రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కోడ్గల్‌లో బండి నర్సింహులు ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి స్వాధీన పర్చుకుని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు సివిల్ సప్లయి డీటీ యూసుఫ్‌అలీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బియ్యాన్ని పలువురు లబ్ధిదారుల నుంచే గాక చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారి నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించామని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పాలమూరు కరివేపాకు సాగుకు అనుకూలం

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


కరివేపాకు పంట

అలంపూర్: కరివేపాకు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుంది. అందుకే కొందరు కూరల్లో వేసుకుని తింటే, మరి కొందరు పౌడర్ రూపంలో తీసుకుంటారు. కరివేపాకు సాగు చేయడం ఎంతో సులభమని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. జిల్లా వాతావరణానికి ఈ సాగు అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. ఎర్ర నేలలో ఈ పంట సాగు చేయడంతో అధిక దిగుబడి వస్తుంది.

విత్తుట

కరివేపాకును విత్తనాల ద్వారా పెంచవచ్చు. విత్తనాలతో నారు మొక్కలను పెంచి ప్రధాన పొలాల్లో నాటాలి. నారు పెంచేందుకు బాగా పండించిన మంచి పండ్లను, బాగా పెరుగుదల కలిగిన తల్లి చెట్ల నుంచి కోయాలి. జూలై–ఆగస్టు నెలల్లో పండ్లు కాస్తాయి. ఆగస్టు నెలలో పండ్లను సేకరించుకుని కోసిన 3–4 రోజుల్లో విత్తనాలను తీసి నారు మళ్లు, పాలిథిన్ సంచుల్లో విత్తాలి. ప్రతి పండులో 3–4 విత్తనాలు ఉంటాయి.

విత్తన మోతాదు

ఎకరాకు 80 నుంచి 100 కిలోల విత్తనాలు లేదా 25 కిలోల పండ్లు సరిపోతాయి.

విత్తే పద్ధతి

మీటరు విస్తీర్ణంలో 30సెం.మీ. ఎత్తు కలిగిన నారుమళ్లను తయారు చేయాలి. నారుమళ్లకు తగినంత పశువుల ఎరువులు వేసిన తర్వాత 10 సెం.మీ. దూరంలో గీసి విత్తనాలను విత్తుకోవాలి. మూడు రోజుల్లో విత్తనాలు మొలకెత్తుతాయి.

నేల తయారీ మొక్కలు నాటే విధానం..

ప్రధాన భూమిని 3 నుంచి 4 సార్లు దున్నాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు 8 టన్నుల పశువుల ఎరువులు వేయాలి. 30.30.30 సెం.మీ. పరిమాణం గల గుంతలను 1.2 నుంచి 1.5మీ దూరంలో మొక్కలు నాటాలి. మొక్కలు నాటడానికి రెండు నెలల ముందు గుంతలు తీయాలి. ఈ గుంతలను పశువుల ఎరువును కలిపి నింపాలి. గుంత మధ్యలో ఒక్కో నారుమొక్క నాటాలి.

పంట రకాలు..

సెంకంపు రకంను తమిళనాడులో అధికంగా పండిస్తారు. ఆకు ఎక్కువగా ఉండి నూనె శాతం, వాసన కలిగి ఉంటాయి.

- డీడబ్ల్యూడీ–1 రకం వేరు పిలకల ద్వారా ఎన్నుకోబడింది. ఆకు ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటుంది. ఇది చలిని తట్టుకోలేదు. ఆకులను పొడిగా చేసి వాడుకోవచ్చు.
- డీ డబ్ల్యూ డీ–2 విత్తనాల ద్వారా వేసిన పంట రకం నుంచి ఎన్నుకోబడింది. ఆకు లేతపసుపు రంగులో ఉండి వాసన తక్కువగా ఉంటుంది. ఈ రకం చలిని తట్టుకుంటుంది. దీని పెరుగుదల అధికంగా ఉంటుంది.
- సువాసిని వేరు మొక్కల ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుంది. మెట్ట ప్రాంతాలకు ఇది అనుకూలం.
- భువనేశ్వర నీటి వసతి ప్రాంతాల్లో ఎక్కువగా సాగు అవుతుంది. అన్ని రకాల నేలల్లో పండిస్తారు. మురుగు నీటి పారుదల సౌకర్యం ఉన్న ఎర్ర నేలలు శ్రేష్ఠం. ఎర్రతువ్వ నేలల్లో పెరుగుదల బాగా ఉంటుంది. ఆకు దిగుబడి ఎక్కువగా ఉంటుంది. మురుగు నీటి పారుదల లేని నల్ల నేలలు పనికి రావు.

ఎరువులు

ఎకరాకు 8 టన్నుల పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేయాలి. ఎకరాకు 28 కేజీల నత్రజని, 9కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్‌ని ఇచ్చే ఎరువులను కలిపి గుంతలో సమానంగా నింపాలి. నీటి యాజమాన్యం, మొక్కలను నాటిన వెంటనే గుంతలను తడపాలి. నాటిన మూడవ రోజు మరోక తడి అందించాలి. వారానికి ఒక తడి అందిస్తు ఉండాలి. గుంతలను కలుపుతూ కాల్వలను ఏర్పాటు చేసి నీటిని అందించాల్సి ఉంటుంది.

సస్య రక్షణ చర్యలు

గొంగళి పురుగు చిన్నప్పుడు తెల్లని చారలతో నలుపు రంగులో ఉంటుంది. తర్వాత ముదురు ఆకుపచ్చ రంగులో లావుగా స్థూపాకారంలో ఉంటుంది. పురుగులను చేతితో తీసి నాశనం చేయడం శ్రేయస్కరం. వేప సంబంధిత క్రిమి సంహార మందులు ఉపయోగించాలి. తప్పని పరిస్థితుల్లో నువాన్ 1 మి.లీ లేదా 2 మి.లీ క్వినాల్‌పాస్ లీటర్ నీటితో కలిపి పిచికారి చేయాలి.

తెగుళ్లు..: ఆకుపచ్చ తెగుళ్ల సోకే అవకాశం ఉంది. దీని నివారణకు గ్రాము కార్బండిజమ్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గంధం కలిగిన క్రిమి నాశికాలను వాడితే ఆకు రాలిపోతుంది. మందును వాడరాదు.

కోత దిగుబడి

మొదటి సంవత్సరం ఎకరాకు 100 నుంచి 160 కిలోల దిగుబడి వస్తుంది. రెండు నుంచి మూడు సంవత్సరాల్లో ప్రతి 4 నెలలకు ఒక్కో కోతలో ఎకరాకు 700కిలోల చొప్పున సంవత్సరానికి 2,100 కిలోల ఆకు దిగుబడి వస్తుంది. 4వ సంవత్సరంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి కోతలో వెయ్యి కిలోల చొప్పున 4వేల కిలోల ఆకు దిగుబడి వస్తుంది. 5 సంవత్సరాల్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి కోతలో ఎకరాకు 2వేల కిలోల ఆకు చొప్పున ఏడాదికి 8వేల కిలో ఆకు దిగుబడి వస్తుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
■ MARAM VENKA REDDY INFRA వారు మహబూబ్‌నగర్‌కు అతిసమీపంలో మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పాదాల చెంత ఫ్రీ రిసార్ట్స్ సౌకర్యంతో 7Hills Sandal Wood Farms అతితక్కువ ధరలకే అమ్మబడును. సం॥ 7874934559, 9110522090.

SERVICES
■ పర్సనల్, బిజినెస్,ప్రాపర్టీ, ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్టిగేజ్ చేసుకొని అతి తక్కువ వడ్డీకి వారం రోజులలో రుణంఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. 8598800260, 8901923173.

CHANGE OF NAME
■ I, Sumithra Alias Suneetha Punyya Gubba W/o G.Ramakrishna R/o H.No. 4-3-48, Shereli Veedhi, Gadwal (Town and Md), Jogulamba Gadwal Dist, T.S. I Change my name from Suneetha Punyya (old name) to Sumithra Alias Suneetha Punyya Gubba (new name).

WANTED
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 83500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520
■ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ.16K, ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్ 9840258899.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
వివరాలకు :
మహబూబ్‌నగర్ : 9010234478, 9010522215, 9705135557, 9010869797
జడ్చర్ల : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు వెలిబుచ్చే క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ ఖాతాల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్

క్లుప్తంగా...

నేడు ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. వెలగపూడిలోని తాత్కాలిక శాసనసభ ప్రాంగణంలో పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శాసనసభలో మొత్తం సభ్యుల సంఖ్య 175. ఇందులో వైఎస్సార్‌సీపీకి 151 మంది సభ్యులు ఉండగా.. టీడీపీకి అధికారికంగా 23 మంది, జనసేనకు ఒకరు ఉన్నారు. నలుగురు సభ్యులు టీడీపీకి దూరంగా ఉంటున్నారు. దీంతో టీడీపీకి 19 మంది బలం మాత్రమే ఉంది. అలాగే జనసేనకు ఉన్న ఒక సభ్యుడు కూడా ఆ పార్టీకి దూరమయ్యారు. ఒక్కో ఎమ్మెల్సీ గెలుపొందడానికి 22 మంది సభ్యుల ఓట్లు అవసరం. వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన ఆధిక్యత ఉన్న నేపథ్యంలో ఏడు స్థానాలకు అభ్యర్థులను బరిలోకి దించింది. ఈ క్రమంలో వాస్తవంగా చూస్తే.. ఒక్క స్థానం గెలవడానికి కూడా టీడీపీకి బలం లేదు. అయినా సరే అభ్యర్థిని బరిలోకి దింపడం చర్చనీయాంశంగా మారింది. కాగా, సాయంత్రం ఐదు గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది.

ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి కన్నుమూత



సాక్షి, అమరావతి: ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి (67) కన్నుమూశారు. హైదరాబాద్‌లో ఉంటున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. హైదరాబాద్ అప్పా జంక్షన్ కాళిమాత టెంపుల్ సమీపంలో నివసిస్తున్న ఆయన బుధవారం రాత్రి 7.45 గంటలకు తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సుధారాణి, కుమార్తెలు దీప్తి, కీర్తి ఉన్నారు. శ్రీనాథ్‌రెడ్డి అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం ఆయన స్వగ్రామం వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం కోరగుంటపల్లిలో నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. పులివెందుల నియోజకవర్గం కోరగుంటపల్లిలో రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించిన ఆయన.. 1978లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో చేరారు. కడప రిపోర్టర్‌గా దాదాపు 30 ఏళ్లు, తరువాత కొంతకాలం హైదరాబాద్‌లో పనిచేశారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు సంస్థలు, బీబీసీ, సాక్షిలో ఉన్నత హోదాల్లో పనిచేశారు. ఏపీయూడబ్ల్యూజేలో కీలకనేతగా వ్యవహరించారు. 2019 నుంచి దాదాపు మూడేళ్లు శ్రీనాథ్‌రెడ్డి ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన మృతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.



పంచాంగ శ్రవణం ఆలకిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతి



ఉగాది పచ్చడి స్వీకరిస్తున్న సీఎం వైఎస్ జగన్ దంపతులు

ఏడాదంతా.. వసంత 'శోభ'

సీఎం జగన్ నివాసంలోని గోశాలలో ఉగాది వేడుకలు

- తెలుగుదనం ఉట్టిపడేలా కొత్త సంవత్సరం సంబరాలు
- సతీసమేతంగా పాల్గొని పూజలు నిర్వహించిన సీఎం జగన్
- పరిపాలన బాగుంటుంది.. సమన్యాయంతో ముందుకువెళ్తారన్న పంచాంగ శ్రవణకర్త సుబ్బరాయ సోమయాజులు

సాక్షి, అమరావతి: శోభకృత్ నామ సంవత్సరంలో తెలుగువారందరికీ మంచి జరగాలని, తెలుగు లోగిళ్లు సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో కళకళలాడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం గోశాలలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు సంప్రదాయం, ఆచారాలు ఉట్టిపడేలా సంబరాలను నిర్వహించారు. తిరుమలలోని ఆనంద నిలయం తరహాలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ నమూనాతో ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మండపంలోని గోడలకు ఏర్పాటు చేసిన దశావతారాల బొమ్మలు ఆకట్టుకున్నాయి.

సీఎం దంపతుల పూజలు

సంప్రదాయ పంచెకట్టులో సతీ సమేతంగా ఉగాది వేడుకలకు ముఖ్యమంత్రి జగన్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీమణి వైఎస్ భారతికి నుదుటున కుంకుమ బొట్టును సీఎం జగన్ దిద్దగా ఆమె కూడా బొట్టు పెట్టారు. అనంతరం ఉగాది వేడుకల ప్రాంగణంలోని శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో సీఎం దంపతులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. టీటీడీ, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వేదపండితులు సీఎం దంపతులకు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందించారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ముఖ్యమంత్రి జగన్ పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాంగకర్త కప్పగంటి సుబ్బరాయ సోమయాజులు రూపొందించిన పంచాంగాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. పంచాంగ శ్రవణం అనంతరం సీఎం జగన్ దంపతులు ఉగాది పచ్చడిని స్వీకరించారు. రాష్ట్రంలో ప్రతి అక్కకు, చెల్లెమ్మకు, ప్రతి సోదరుడికి, స్నేహితుడికి, అవ్వాతాతలకూ నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని, దేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని మనసారా ఆకాంక్షిస్తూ సీఎం జగన్ అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

పరిపాలన బాగుంటుంది

ఏపీలో పరిపాలన బాగుంటుందని పంచాంగ శ్రవణంలో సుబ్బరాయ సోమయాజులు చెప్పారు. 'ఈ ఏడాది శ్రామికులు, కర్షకులకు లాభదాయకంగా ఉంటుంది. పశు సంపద, పాడి పరిశ్రమ బాగుంటుంది. ప్రభుత్వ విధానాలు రైతులకు అనుకూలంగా ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రజల మధ్య స్నేహం విలసిల్లి ముందుకు నడుస్తారు. విజయవంతమైన పథకాలను చేపట్టి ముందుకు వెళ్తారు. ప్రజలకు అవసరమైన ప్రణాళికలను అమలు చేస్తారు. సమన్యాయంతో ముందుకువెళ్తారు. ఈ ఏడాదంతా రాష్ట్ర ప్రజలకు మంచి ఫలితాలు లభించడానికి అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి' అని పేర్కొన్నారు.

రూ.7.48 కోట్ల బంగారం స్వాధీనం...

నలుగురి అరెస్టు
కస్టమ్స్ అధికారుల విస్తృత దాడులు

సాక్షి, అమరావతి/పటమట (విజయవాడ తూర్పు): విజయవాడ కస్టమ్స్ విభాగం అధికారులు బుధవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న రూ.7.48 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు విజయవాడ రైల్వే స్టేషన్‌లో కస్టమ్స్ అధికారులు 5 కేజీల అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ నిందితులను విచారించి రాబట్టిన సమాచారం ఆధారంగా ఏపీ-తమిళనాడు సరిహద్దుల్లో 30 మంది అధికారుల బృందం విస్తృతంగా దాడులు చేసి కార్లు, స్కూటర్లలో అక్రమంగా తరలిస్తున్న మరో 7.79 కేజీల బంగారాన్ని పట్టుకున్నారు. మొత్తం మీద 15 ప్రాంతాల్లో మొత్తం రూ.7.48 కోట్ల విలువైన 12.97 కేజీల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచారు. కాగా, 2022-23లో విజయవాడ కస్టమ్స్ అధికారులు దాడులు నిర్వహించి రూ.19.75 కోట్ల విలువైన అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ కమిషనర్ కె.ఇంజనీర్ తెలిపారు.

నేడు స్పెషాలిటీ వైద్య పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో 5 స్పెషాలిటీల్లో 180 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (సీఏఎస్ఎస్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం గురువారం వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనుంది. విజయవాడలోని పాత జీజీహెచ్ ప్రాంగణంలో ఉన్న డీఎంఈ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో 14 స్పెషాలిటీల్లో 445 పోస్టుల భర్తీకి 23 నుంచి 27వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. పూర్తి వివరాలకు 6301138782 నంబర్‌ను సంప్రదించవచ్చు.




శ్రీవారి చెంత వేడుకగా ఉగాది ఆస్థానం

శోభాయమానంగా ఫల, పుష్పాలంకరణ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఆస్థానం వేడుకగా జరిగింది. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేశారు. విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశించారు. శ్రీవారి ఉత్సవమూర్తులు బంగారు వాకిలిలో గరుడాళ్వారుకు అభిముఖంగా సర్వభూపాల వాహనంపై వేంచేపు చేశారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడు శ్రీ విష్వక్సేనుల వారిని వేంచేపు చేశారు. ఆ తరువాత శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపచేసి పంచాంగ శ్రవణం నిర్వహించారు. బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఉగాదిని పురస్కరించుకుని టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆలయం లోపల విభిన్న రకాల పండ్ల గుత్తులు, అపురూపమైన ఉత్తమజాతి పుష్పాలతో శ్రీవారి ఆలయాన్ని ఆకర్షణీయంగా అలంకరించారు. కాగా, టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 12 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 3 గంటల్లో శ్రీవారి దర్శనమవుతోంది.

రూ.4,411.68 కోట్లతో టీటీడీ బడ్జెట్

- 2023-24 బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం



తిరుమల: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2023- 24కి) తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. రూ.4,411.68 కోట్ల బడ్జెట్‌ను ఫిబ్రవరి 15న జరిగిన పాలకమండలి సమావేశం ఆమోదించినట్లు టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున అప్పుడు ఈ వివరాలు వెల్లడించలేదని తెలిపారు. తిరుమలలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసిందని చెప్పారు. గత నెలలో జరిగిన పాలకమండలి సమావేశంలో కొన్ని పాలనపరమైన నిర్ణయాలు కూడా తీసుకున్నట్లు తెలిపారు. సుబ్బారెడ్డి వెల్లడించిన వివరాలు..

* వీఐపీ బ్రేక్ దర్శన సమయం మార్చినందువల్ల సామాన్య భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఈ విధానాన్ని కొనసాగిస్తాం.
* కోవిడ్‌కు ముందు ఏడాదికి రూ.1,200 కోట్ల కానుకలు లభించేవి. కోవిడ్ తరువాత హుండీ ఆదాయం ఏడాదికి రూ.1,500 కోట్ల వరకు పెరిగింది.
* కోవిడ్ సమయంలో వర్చ్యువల్ సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో జారీచేశాం. ఈ సేవలు కొనసాగించాలని నిర్ణయించాం.
* వేసవిలో మూడునెలలు భక్తుల రద్దీ బాగా పెరిగే అవకాశం ఉన్నందువల్ల వీఐపీల సిఫారసులు బాగా తగ్గించాలని కోరుతున్నాం. శ్రీవాణి టికెట్ల సంఖ్య కూడా తగ్గించి ఎక్కువమంది సామాన్య భక్తులకు దర్శనం కల్పిస్తాం.

హుండీ ద్వారా రూ.1,591 కోట్ల రాబడి అంచనా

వచ్చే ఆర్థిక సంవత్సరంలో శ్రీవారి హుండీ ద్వారా సుమారు రూ.1,591 కోట్ల ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో టీటీడీ అంచనా వేసింది. 2022-23 బడ్జెట్‌తో పోలిస్తే ఈ బడ్జెట్ రూ.1,315.28 కోట్ల మేర పెరిగింది. టీటీడీ వివిధ బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన నగదు, బంగారం ద్వారా పెద్ద ఎత్తున వడ్డీ ఆదాయం లభిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.813 కోట్ల వడ్డీ వస్తున్నట్లు అంచనా వేసిన టీటీడీ.. రానున్న ఆర్థిక సంవత్సరంలో వడ్డీ ఆదాయం మరో రూ.177 కోట్లు పెరిగి మొత్తం రూ.990 కోట్లు వస్తాయని పేర్కొంది.

శేషవాహనంపై శ్రీరంగనాథస్వామి



పెబ్బేరు రూరల్: ఉగాది పండుగ సందర్భంగా శ్రీరంగాపురం మండల కేంద్రంలో శ్రీరంగనాథస్వామి, అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శేష వాహనంపై ఉత్సవ మూర్తులను ఊరేగించారు. భక్తులు గోవిందనామ స్మరణతో కార్యక్రమాన్ని వీక్షించారు.

ఎస్సీ వర్గీకరణ చేసే వరకు పోరాటం

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ చేసే వరకు పోరాడుతామని ఎమ్మార్పీఎస్-ఆర్ఆర్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సింగిరెడ్డి పరమేశ్వర్ తెలిపారు. బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ, మహిళా బిల్లుకు చట్టబద్ధత కల్పించి, కొత్తపార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఈనెల 30న దీక్ష, 31న ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జస్టిస్ ఉషామెహ్రా కమిషన్ నివేదిక ద్వారా ఎస్సీ వర్గీకరణ ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రాలు చేసుకునే విధంగా పార్లమెంట్‌లో బిల్లు పెట్టే అవకాశం ఉన్నా మాదిగ, మాదిగ ఉప కులాలను బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో పూర్తి మెజారిటీ వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని నమ్మించి మోసం చేసిందని, గొప్పలు చెప్పుకునే బీజేపీని రాజకీయంగా బొంద పెట్టడానికి మాదిగలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బుర్రన్న, అశోక్, రమేష్, రాజశేఖర్, తిరుమలయ్య, రమేష్, విజయ్, చెన్నయ్య, రాజు, నగేష్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సాగునీటి కాల్వలను పట్టించుకోరా?



అజ్జకొల్లు వద్ద సరళాసాగర్ ఎడమ కాల్వ దుస్థితి

- సరళాసాగర్ ఎడమ కాల్వలో పేరుకుపోయిన చెత్త
- వృథాగా వెళ్తున్న నీరు

మదనాపురం: మండలంలోని సరళసాగర్ ఎడమ కాల్వ పరిస్థితి అధ్వానంగా తయారైంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాల్వ పొడవున చెత్త, ముళ్ల కంప పేరుకుపోయింది. దీంతో నీరు దిగువ ఆయకట్టు రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా ఎడమ కాల్వ ద్వారానే ఆయకట్టుకు సాగునీరు అందుతుంది.

9 గ్రామాలకు 3,800 ఎకరాలు

సరళాసాగర్ ప్రాజెక్టు ద్వారా 3,800 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, ప్రస్తుతం 2వేల ఎకరాలు మాత్రమే అందుతుంది. కరమ్మ పేట, దంతనూరు, మదనాపురం, రామన్‌పాడు, నెలివిడి తిరుమలపల్లి, అజ్జకొల్లు, కొత్తకోట మండలంలోని వడ్డెవాట, చర్లపల్లి గ్రామాల్లో కాల్వ ఉంది. కాల్వ పొడవునా మొదటి నుంచి చివరి ఆయకట్టు వరకు కాల్వ పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎక్కడపడితే అక్కడ లీకేజీలు ఉన్నాయి. కుడి, ఎడమ వైపు ముళ్ల కంప, చెత్త పేరుకపోయింది. ఎడమ కాల్వకు ఉన్న రామన్‌పాడు డిస్ట్రిబ్యూటర్ల కాల్వ కనపించడం లేదు.



రామన్‌పాడు వద్ద డిస్ట్రిబ్యూటరీ కాల్వ దుస్థితి

10ఏళ్లుగా పట్టించుకునేవారు కరువు

నీటి పారుదలశాఖ అధికారులు కాల్వలపై దృష్టి పెట్టడం లేదు. ఎప్పటికప్పుడు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగిస్తేనే మొదటి నుంచి చివరి ఆయకట్టు వరకు నీరు ఇబ్బంది లేకుండా వెళ్తుంది. కానీ ఇక్కడ నిబంధనలు గాలికి వదిలేశారు. 10ఏళ్లుగా ఏమాత్రం పట్టించుకోకపోవడంతో కాల్వల పరిస్థితి ఈవిధంగా తయారైందని రైతులు అంటున్నారు.

పట్టించుకోవడం లేదు..



సరళాసాగర్ కాల్వపై అధికారుల పట్టించుకోవడం లేదు. అనేక చోట్ల లీకేజీలు ఉన్నాయి. కాల్వల నిండా చెత్త పేరుకుపోయింది. ఏళ్లుగా శుభ్రం చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– అంజద్‌అలీ, రామన్‌పాడు

శిథిలావస్థకు..



సరళాసాగర్ ఎడమ కాల్వ శిథిలావస్థకు చేరింది. ప్రాజెక్టు నుంచి వచ్చే నీరు లీకేజీల కారణంగా పూర్తి స్థాయిలో వెళ్లడం లేదు. కాల్వ నిండా మట్టి, ముళ్లపొదలు అలుముకున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– మొగిలి, అజ్జకొల్లు

కాల్వలను శుభ్రం చేస్తాం

సరళాసాగర్ ఎడమ కాల్వ డిస్ట్రిబ్యూటర్ కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలతో శుభ్రం చేయించాలని ఎంపీడీఓకు విన్నవించాం. వారి సహకారంతో తప్పకుండా కాల్వలను శుభ్రం చేస్తాం.

– అనిల్‌రెడ్డి, నీటిపారుల శాఖ ఏఈ, సరళాసాగర్

భక్ష్యాలకు భలే గిరాకీ

- పండుగ పూట జోరుగా విక్రయాలు
- పట్టణంలో పలుచోట్ల తయారీ, విక్రయ కేంద్రాలు



తయారు చేస్తున్న మహిళలు

జడ్చర్ల టౌన్: ఉగాది అనగానే గుర్తుకొచ్చేవి షడ్రుచుల పచ్చడి, భక్ష్యాలు. పండుగ వేళ పట్టణంలో భక్ష్యాలకు భలే గిరాకి కనిపించింది. అన్ని కేంద్రాల్లో పండుగ రోజు 6 వేలకు పైగా భక్ష్యాలు అమ్ముడయ్యాయంటే ఎంత డిమాండ్ ఉందో అర్థమవుతోంది. వీటి తయారీ, విక్రయం కొందరికి ఉపాధి కల్పిస్తోంది. రెండు శాబ్దాల కిందటి వరకు ఇళ్లల్లోనే తయారు చేసుకొనే వారు. ప్రస్తుత యాంత్రిక జీవనం, పని వత్తిడి, చిన్న కుటుంబాలు పెరగటంతో తయారీకి సమయం దొరక్కపోవడం తయారీదారులకు వరంగా మారింది. ముఖ్యంగా ఉగాది, దసరా పండుగ రోజుల్లో ముందుగానే ఆర్డర్లు ఇచ్చి తయారు చేయించుకుంటున్నారు. చిన్న కుటుంబం అయితే 5, పెద్ద కుటుంబం అయితే 20 నుంచి 40 వరకు కొనుగోలు చేస్తున్నారు. పట్టణంలోని సాయినగర్‌కాలని, వాసవి కంపౌండ్‌లో వీటిని తయారుచేసి విక్రయిస్తుంటారు. వీరితోపాటు మరికొందరు సైతం ఉపాధి పొందుతున్నారు. సాధారణ రోజుల్లో 100 నుంచి 200 వరకు తయారుచేసి హోటళ్లకు విక్రయిస్తున్నామని చెబుతున్నారు. బెల్లం భక్ష్యాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. చెక్కెర, రవ్వ భక్ష్యాలు, నేతి బెల్లం భక్ష్యాలు సైతం చేస్తుంటారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న భక్ష్యాలు

నాలుగేళ్లుగా..



నాలుగేళ్లుగా భక్ష్యాలు తయారు చేస్తున్నాం. ఉగాది, దసరా పండుగ రోజుల్లో 1,500 నుంచి 2 వేల వరకు విక్రయిస్తాం. కుటుంబ సభ్యులతో పాటు మరో ఇద్దరు మహిళలు తయారీకి వస్తారు. శుభకార్యాలున్న సమయంలో డిమాండ్ బాగానే ఉంటుంది. సాధారణ రోజుల్లో 100 వరకు చేసి హోటళ్లకు సరఫరా చేస్తాం.

– రాజనర్సింహ, సాయినగర్‌కాలని, బాదేపల్లి

మూడేళ్లుగా కొంటున్నాం..



ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా, పండగలొచ్చినా భక్ష్యాలు ఉండాల్సిందే. ముఖ్యంగా ఉగాది అంటేనే పచ్చడి, భక్ష్యాలు ప్రత్యేకం. సమయా భావంతో ఇళ్లల్లో తయారీకి వీలు కావటం లేదు. మూడేళ్లుగా కొనుగోలు చేస్తున్నాం.

– సాయికుమార్, సాయినగర్‌కాలని

మన్యంకొండలో వైభవంగా సంబరాలు

- స్వర్ణాభరణ అలంకరణలో దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి
- ఘనంగా పంచాంగ శ్రవణం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి నూతన వస్త్రధారణ చేసి బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామివారిని పల్లకీలో గర్భగుడి నుంచి హనుమద్దాసుల మండపం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం పూజలు చేసి హారతి ఇచ్చారు. అనంతరం పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు పూజలు చేసి తరించారు.



మన్యంకొండలో పంచాంగ శ్రవణం చేస్తున్న పురోహితులు

ఘనంగా పల్లకీసేవ

పండుగ సందర్భంగా దేవస్థానంలో స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. అలంకరించిన పల్లకిలో స్వామివారిని గర్భగుడి నుంచి గుండం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం గుండం వద్ద ఆరగింపు తదితర పూజలు చేశారు. తిరిగి మళ్లీ పల్లకీలో స్వామివారి ఊరేగింపుగా గర్భగుడి వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు.



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అలంకరణలో స్వామివారు

లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఈనెల 30వ తేదీ వరకు స్వర్ణాభర అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. విశేషోత్సవాలలో మాత్రమే స్వామివారికి స్వర్ణాభరణ అలంకరణ చేస్తారు. శ్రీరామ నవమి వరకు స్వామివారికి ఈ అలంకరణ ఉంటుంది.

పీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర బృందం



తాడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఎన్‌క్యూఏఎస్ బృందం సందర్శించింది. డాక్టర్ అబోలే గోరే, సౌమ్యా మహంతీ ఆధ్వర్యంలో వారు ఆస్పత్రి ఆవరణ, రోగుల వివరాలు, సిబ్బంది పనితీరు, వివిధ అంశాలను పరిశీలించారు. కంటి వెలుగు వివరాలు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండల వైద్యాధికారి సంతోష్ అభిరాం వివరాలను వారికి తెలిపారు. ఆరు విభాగాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సూచనలు, సలహాలు చేశారు.